సాక్షి
ప్రకాశం
బుధవారం ౹ 21 ౹ ఆగస్టు ౹ 2024



పనులపై మెలిక.. ఎందుకు ఏలికా?

రూ.50 కోట్ల అంచనా వ్యయంతో దర్శి సాగర్ కెనాల్ నుంచి పొదిలి వరకు పైప్‌లైన్ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేగంగా సాగిన పనులు ప్రస్తుతం ఆగిపోయాయి.

- 8లో..



మైనర్‌పై అఘాయిత్యం

ఓ టీడీపీ నేత కుమారుడు 14 ఏళ్ల బాలికకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసిన ఘటన దర్శి మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. బాలిక ప్రస్తుతం 7వ నెల గర్భిణిగా ఉంది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36.3/29.2

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పొగాకు ధర గరిష్టంగా రూ.358

● కనిష్ట ధర రూ.204



పొదిలిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధరలు మంగళవారం గరిష్టంగా కేజీ రూ.358 ధర పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 10,109 బేళ్లు రాగా, 8,402 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 1702 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు (పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 135వ రోజు వేలం పాటలో 5,924 బేళ్లు రాగా 5,106 వ్యాపారులు కొనుగోలు చేశారు. 818 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.308.76 వచ్చింది. కందుకూరు–1, 2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 129వ రోజు వేలం పాటలో 4,185 బేళ్లు రాగా 3301 బేళ్లు కొనుగోలయ్యాయి. 884 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.358, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.293.24 పలికింది.

అమరులైన సైనికులకు నివాళులు

● అమర్ జవాన్ స్థూపాన్ని సందర్శించిన ఆర్మీ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకటరెడ్డి



అమర జవాన్ స్థూపం వద్ద ఆర్మీ అధికారులు

మార్కాపురం: పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన అమర్ జవాన్ స్థూపాన్ని ఆర్మీ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకటరెడ్డి, జిల్లా సైనిక్‌బోర్డు అధికారిని రజని సందర్శించి అమరులైన సైనికులకు నివాళులర్పించారు. మాజీ సైనికుల సంక్షేమానికి తమవంతు సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ హరినారాయణరెడ్డి, వీ శేషసాయి, గౌరవ అధ్యక్షులు డాక్టర్ రాంబాబు, సీహెచ్ రామకృష్ణ, చెన్నయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటును మండలానికి పరిమితం చేయాలి

ఒంగోలు: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను మండలానికి పరిమితం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సంఘం(ఆపస్) రాష్ట్ర సంఘటనా కార్యదర్శి సీహెచ్ శ్రావణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మండల స్థాయిలో ఎస్‌జీటీల అవసరం ఉన్నప్పటికీ, ముఖ్యంగా క్వాలిఫైడ్ ఎస్‌జీటీలను బలవంతంగా ఉన్నత పాఠశాలలకు కేటాయించడం సరికాదన్నారు. సర్దుబాటు చేసే అంశంలో ఉపాధ్యాయుల ఇష్టాన్ని పరిగణలోకి తీసుకోవాలని, వారికి ఇష్టం లేకుండా బలవంతంగా ఉన్నత పాఠశాలలకు పంపడం సరికాదన్నారు. గతంలో సర్దుబాటుకు 8 కిలోమీటర్ల పరిధి ఉండేదన్నారు. కానీ నేడు ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ ఉందని సుదూర ప్రాంతాలకు బలవంతపు సర్దుబాటు చేయరాదని ఆపస్ తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఈవీఎంల్లో పడిన ఓట్లు..వీవీప్యాట్ స్లిప్‌లతో సరిపోల్చాలని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కోరితే.. ఎన్నికల సంఘం అధికారులు అందుకు భిన్నంగా మాక్ పోలింగ్‌కు సిద్ధపడ్డారు. సుప్రీంకోర్టు ఆదేశాలను కాదని డమ్మీలతో చెకింగ్ అంటూ ముందుకొచ్చారు. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం అధికారుల తీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రీచెక్ చేసేందుకు ఈసీకి ఎందుకంత ఉలికిపాటంటూ రాజకీయపక్షాలు నిలదీస్తున్నాయి. మాక్‌పేరుతో ఓట్లు తీసేస్తే ఎలా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



డమ్మీ న్యాయం..!

● బాలినేని అడిగిందొకటి.. ఈసీ చేస్తోందొకటి..!
● రీచెక్‌పై ఈసీ ఉలికిపాటెందుకో..?
● ఈవీఎంలను, వీవీ ప్యాట్ స్లిప్‌లతో పరిశీలనకు వెనకడుగు
● సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్‌ను గాలికి వదిలేసిన అధికారులు
● మాక్‌పోలింగ్ పేరుతో ఈవీఎంల్లోని డేటా తొలగించేందుకు సిద్ధం
● వైఎస్సార్ సీపీ బహిష్కరించడంతో నిలిచిపోయిన మాక్‌పోలింగ్
● డేటా తొలగించాక కోర్టు వెరిఫికేషన్ చేయమంటే ఏం చేసేవారో
● ఎన్నికల కమిషన్, అధికారుల తీరుపై విమర్శలు
● మానవ హక్కుల కమిషన్‌కూ ఫిర్యాదు చేసిన బాలినేని

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంల్లో అవకతవకలు జరిగాయని దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా మన రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు నాయకులను, ఓటర్లను విస్మయానికి గురిచేశాయి. ఈ నేపథ్యంలో ఒంగోలు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఈవీఎంల అవకతవకలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. పోలింగ్ రోజు వినియోగించిన ఈవీఎంల్లోని ఓట్లను పరిశీలించాలని కోరుతూ ఈసీ నిర్దేశించిన రూ.5,66,400 రుసుము చెల్లించారు. నగరంలోని 12 పోలింగ్ కేంద్రాల ఈవీఎంల ఓట్లను, వీవీ ప్యాట్‌లలోని సింబల్ స్లిప్‌లతో సరిచూడాలని ఫిర్యాదులో కోరారు. పరిశీలనకు 6, 26, 42, 59, 75, 76, 123, 184, 192, 199, 245, 256 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. దీంతో ఈసీ ఈవీఎంల చెకింగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ నెల 19వ తేదీన జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే బాలినేని కోరిన విధంగా కాకుండా పోలింగ్ రోజు వినియోగించిన ఈవీఎంల్లోని ఓట్లను డిలీట్ చేసి, కేవలం ఈవీఎంల పనితీరును మాత్రమే చెక్ చేస్తామని స్పష్టం చేశారు. దీనిపై బాలినేని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈవీఎంలు కొత్తగా వచ్చినపుడు ఫస్ట్‌లెవల్ చెకింగ్, కమిషన్ చెకింగ్ చివరికి పోలింగ్ రోజు కూడా అన్నీ పార్టీల ఏజెంట్ల ద్వారా మాక్ పోలింగ్ నిర్వహిస్తారని మరలా ఇప్పుడు మాక్‌పోలింగ్ నిర్వహించడం అర్థం లేదన్నారు. పోలింగ్ రోజు వినియోగించిన ఈవీఎంల్లోని ఓట్లు, వీవీ ప్యాట్ స్లిప్‌లతో సరిచేస్తే సందేహాలు నివృత్తి అవుతాయని ఆయన అన్నారు. అయితే కలెక్టర్ ఎన్నికల సంఘం ఎస్‌ఓపీ మేరకు ఈవీఎంల చెకింగ్ మాత్రమే చేస్తామని అధికారుల నుంచి సమాధానం వచ్చింది. ఇలాగైతే న్యాయం జరగదని భావించిన బాలినేని హైకోర్టును ఆశ్రయించారు. ఒక వైపు కోర్టులో విచారణ జరుగుతుండగానే జిల్లా అధికారులు మాక్ పోలింగ్‌కు ఏర్పాటు చేశారు. సోమవారం ఒంగోలులో ఈవీఎంలు భద్రపరిచిన గోదాము వద్దకు అధికారులతో పాటు వివిధ రాజకీయ పక్షాల నేతలు హాజరయ్యారు. మాక్‌పోలింగ్ ప్రక్రియను బహిష్కరిస్తున్నామని బాలినేని తరపున హాజరైన వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మాక్‌పోలింగ్‌ను నిలిపివేస్తున్నట్లు ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రకటించారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



ఒంగోలులో మాక్‌పోలింగ్ బహిష్కరించి బయటకు వస్తున్న వైఎస్సార్ సీపీ ప్రతినిధులు (ఫైల్)

సుప్రీం తీర్పు ఏం చెబుతోందంటే...

ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఏదైనా అనుమానాలు వస్తే ఈవీఎంల్లో వచ్చిన ఓట్లు, వీవీ ప్యాట్‌ల్లో ఉన్న స్లిప్‌లతో సరిపోల్చాలని ఎన్నికల్లో పోటీ చేసి రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు ఈసీని కోరవచ్చని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. సుప్రీం తీర్పు ప్రకారం నియోజకవర్గంలో 5 శాతం ఈవీఎంలను పరిశీలించాల్సి ఉంది. అయితే సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను ఎన్నికల సంఘం అధికారులు గాలికొదిలేశారు. అభ్యర్థి కోరిన పోలింగ్ బూతుల్లో వినియోగించిన ఈవీఎం ఓట్లను తొలగించి మాక్ పోలింగ్ నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో ఈవీఎంల అవకతవకలపై అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ఒకవేళ పోలింగ్ రోజు వినియోగించిన ఈవీఎంల్లోని ఓట్లను తొలగించి మాక్‌పోలింగ్ నిర్వహించి ఉంటే కోర్టు ఈవీఎంల వెరిఫికేషన్ చేయాలని ఉత్తర్వులు ఇస్తే అధికారులు ఏం చేసి ఉండేవారో అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మాక్‌పోలింగ్ ప్రక్రియ ఎవరి మెప్పు కోసం నిర్వహిస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మాక్‌పోలింగ్ కాకుండా ఈవీఎంల్లోని ఓట్లను వీవీప్యాట్‌లతో సరిచూడాలని బాలినేని హైకోర్టును ఆశ్రయించిన కేసు బుధవారానికి వాయిదా పడింది. ఈ విషయంపై అవసరమైతే సుప్రీం కోర్టును కూడా ఆశ్రయిస్తానని బాలినేని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఎన్నికల సంఘం, అధికారులు పోలింగ్ రోజు ఓట్లను తొలగించి మాక్ పోలింగ్ నిర్వహిస్తామనడంపై బాలినేని మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఓట్లను తొలగిస్తే నిజాలు నిగ్గు తేలేది ఎలా..?

ఎన్నికల సంఘం, అధికారులు ఈవీఎంల్లో అవకతవకలు ఉన్నాయని వచ్చిన అనుమానాలు నివృత్తి చేయాల్సింది పోయి కంటి తుడుపు చర్యలు తీసుకోవడం విస్మయానికి గురి చేస్తోంది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ఈవీఎంలను పరిశీలించాల్సిందిపోయి ఈసీ వ్యవహరిస్తున్న తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్ రోజు ఓట్లను ఈవీఎంల్లో తొలగిస్తామని, ఎన్నికల సంఘం ఎస్‌ఓపీ మేరకు కేవలం డమ్మీ బ్యాలెట్‌తో యంత్రాలు సరిగా పనిచేస్తున్నాయా లేదా చెక్ చేస్తామనడంలో అర్థంలేదని రాజకీయపక్షాలు విమర్శిస్తున్నాయి. ఏ తప్పులు జరగకుంటే పోలైన రోజు ఈవీఎం ఓట్లను, వీవీ ప్యాట్‌లోని స్లిప్‌లతో పరిశీలించవచ్చు కదా అని నిలదీస్తున్నారు. ఈవీఎంల పనితీరుపై దేశవ్యాప్తంగా చర్చ నడుస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరు ఆరోపణలకు మరింత బలం చేకూర్చేలా ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

నిందితులను వదిలేసి బాధితులపై చర్యలా?

● ఇదేం న్యాయమని ప్రశ్నించిన జూడాలు
● 5వ రోజుకు చేరిన జూడాల ఉద్యమం
● మంగళవారం బ్లాక్‌డే పాటించి నిరసన
● న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం



మాట్లాడుతున్న వైద్యురాలు

ఒంగోలు టౌన్: కోల్‌కత్తా ఆర్‌జీ కార్ ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన రేప్ అండ్ మర్డర్ కేసులో నిందితులను వదిలేసి న్యాయం చేయాలని అడుగుతున్న బాధితులపైనే కేసులు పెట్టడం విచిత్రంగా ఉందని, ఇదేం న్యాయమని ఒంగోలు జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డా.అజయ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. వైద్యురాలి హత్య కేసులో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన సీనియర్ వైద్యులకు సమన్లు జారీ చేయడం సబబుకాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేకూర్చాలని, వైద్యులపై దాడులు జరగకుండా సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ జీజీహెచ్ ఆవరణలో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ చేపట్టిన దీక్ష 5వ రోజు కూడా కొనసాగింది. నల్లదుస్తులు ధరించి దీక్షలో పాల్గొన్న జూడాలు మంగళవారం బ్లాక్‌డేని పాటించారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ డా.శృతి మాట్లాడుతూ మహిళా వైద్యులపై, అత్యాచారాలను, దాడులను అరికట్టేందుకు సమగ్ర చట్టం తెచ్చేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రోజురోజుకూ మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. నిందితులకు కఠిన శిక్షలు విధించాలని, ఎవరైనా అత్యాచారానికి పాల్పడాలంటే భయపడిపోయేలా శిక్షలు ఉండాలని చెప్పారు. జూడాల పోరాటానికి ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మిగతా అన్నీ విభాగాలకు చెందిన వారు మద్దతు పలికారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు చైతన్య సాయి, పి.విష్ణుప్రియ, అవినాష్ కుమార్, పవిత్ర, రాము, హర్షిత, శివ రామకృష్ణ, నాగేంద్ర, సత్యసాయి, చరణ్, బి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మికంగా ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన

● ఫ్రీ హోల్డ్ భూముల ప్రక్రియపై సీసీఎల్‌ఏ, కలెక్టర్ ఆకస్మిక పరిశీలన
● క్షేత్రస్థాయి అధికారులకు సమాచారం ఇవ్వకుండా తనిఖీ
● ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కారాదన్న సీసీఎల్‌ఏ, కలెక్టర్



క్షేత్ర స్థాయి పర్యటనలో సీసీఎల్‌ఏ, కలెక్టర్

కనిగిరి రూరల్: ఫ్రీ హోల్డ్ భూముల ప్రక్రియకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఆకస్మికంగా సీసీఎల్‌ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) జీ జయలక్ష్మి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ ఆర్ గోపాలకృష్ణ మంగళవారం పరిశీలించారు. భూముల ఫ్రీ హోల్డ్ వెరిఫికేషన్ పరిశీలనకు కనిగిరి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న నేపథ్యంలో ఈ పరిశీలన చేశారు.

ఫిర్యాదులపై క్షేత్ర స్థాయి పరిశీలన..

ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి కనిగిరి మండలంలో సుమారు 500 ఎకరాలు మార్పులు జరిగినట్లు తెలిసింది. అయితే వీటిలో కొన్ని భూములకు సంబంధించి పట్టణంలో సుమారు 5 నుంచి 10 మంది ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో కనిగిరి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని అధికారులు పరిశీలనలు చేపట్టారు. ఈ మేరకు స్థానిక క్షేత్ర స్థాయి అధికారులెవరికీ సమాచారం ఇవ్వకుండా క్షేత్ర స్థాయి విజిట్‌కు వెళ్లి రైతులతో.. భూముల పరిసర ప్రాంత వ్యవసాయదారులతో సీసీఎల్‌ఏ, కలెక్టర్‌లు నేరుగా మాట్లాడారు. అక్కడే రికార్డులను పరిశీలించారు. అందులో భాగంగా పట్టణంలోని శంఖవరం గ్రామ సర్వే నంబర్‌లోని 562/4 భూములను పరిశీలించారు. అర్జీదారులతో, రైతులతో మాట్లాడారు.

సుమారు 3 గంటల సేపు రికార్డుల పరిశీలన:

క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం సుమారు 3 గంటలకు సేపు సీసీఎల్‌ఏ, కలెక్టర్‌లు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్న రెవెన్యూ బృందాలతో మాట్లాడారు. ఆర్డీఓ పీ జాన్ ఇర్విన్, తహసీల్దార్ సీహెచ్ కిషోర్‌రెడ్డిల సమక్షంలో వివిధ రెవెన్యూ ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించి.. తగు వివరాలు సేకరించారు. ఫ్రీ హోల్డ్ భూముల ప్రక్రియలో వారసత్వంగా మార్పులు ఎన్ని జరిగాయి.. అక్రమ ప్రక్రియల ద్వారా ఏ సర్వే నంబర్లలో ఎన్ని ఎకరాల్లో మార్పు చేశారు.. ఫిర్యాదుదారుల నివేదికల్లో వాస్తవికత ఎంతా.. ఇలా అన్ని కోణాల్లో పరిశీలనలు చేపట్టారు.

ఎస్‌ఆర్‌ఓ రికార్డుల పరిశీలన:

అనంతరం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఇటీవల జరిగిన ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల వివరాలు, క్రయ విక్రయాల రికార్డులను కూడా తెప్పించుకుని పరిశీలించారు. అనంతరం కనిగిరి సబ్ రిజిస్ట్రార్ అధికారితో మాట్లాడారు. ఏ ప్రక్రియ ద్వారా ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని సబ్ రిజిస్ట్రార్ అధికారిని సీసీఎల్‌ఏ అడిగారు. వెబ్ ల్యాండ్ నివేదిక, మా భూమి పోర్టల్ పరిశీలన చేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు వివరించినట్లు తెలిసింది.

తొలుత అధికారులతో సమావేశం:

ఆర్డీఓ కార్యాలయంలో తొలుత ఆర్డీఓ ఫ్రీ హోల్డ్ పరిశీలన బృందాలతో సీసీఎల్‌ఏ, కలెక్టర్‌లు సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రెవిన్యూ సదస్సులు నిర్వహించనున్న నేపథ్యంలో పాత వెరిఫికేషన్‌లో ఏమైనా తప్పులుంటే వాటిని ఏవిధంగా సరిచేయాలనే అంశంపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ భూములను ఎట్టి పరిస్థితుల్లోను ఆక్రమణకు, అన్యాక్రాంతానికి గురి కాకుండా చూడాలని అధికారులకు సీసీఎల్‌ఏ జీ జయలక్ష్మి ఆదేశించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీరాములు, తహసీల్దార్ అశోక్‌రెడ్డి, మండల సర్వేయర్ వైష్ణవి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల సమస్యలపై గళం విప్పాలి

● మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



పెద్దారవీడు సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దారవీడు: గ్రామాల్లో ఉన్న సమస్యలపై ప్రజా ప్రతినిధులు గళం విప్పి సమస్యలను పరిష్కరించేందుకు మండల సర్వసభ్య సమావేశం మంచి వేదిగా ఉంటుందని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల సమావేశంలో గ్రామాల్లో ఉన్న సమస్యలు మండల స్థాయి అధికారుల ఎదుట విన్నవించుకుంటే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. అధికారులు సర్పంచులకు ఇవ్వాల్సిన అధికారం ఇవ్వాలని, పార్టీ నాయకుల వత్తిళ్లకు అధికారులు తలవంచకుండా న్యాయపరంగా పనులు చేయాలన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీకతీతంగా ప్రజలకు పనులు చేయాలని అధికారులకు స్వేచ్ఛ ఇచ్చారని ఇప్పుడు ఉన్న పార్టీ నాయకులు ఒకే పార్టీకి పనులు చేయాలని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని తెలిపారు. ఉపాధి పథకం ద్వారా ఒకసారి రూ.5 కోట్లు, రెండో సారి రూ.3 కోట్లు గ్రామాల అభివృద్ధికి, ఉద్యాన పంటలకు నిధుల ప్రణాళిక నివేదికను ఎవరు తయారు చేయమన్నారు. ఎలా తయారు చేశారు. స్థానిక ఎమ్మెల్యే, సర్పంచులకు తెలియకుండానే నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి ఎవరు పంపించమన్నారని ఎంపీడీఓను ప్రశ్నించారు. 23వ తేదీ గ్రామాల్లో జరిగే గ్రామ సభల్లో ఆమోదించిన పనులకు మాత్రమే నిధులు మంజూరవుతాయని, సర్పంచులు పనులపై సమగ్రంగా గుర్తించి వాటిపై తీర్మానాలు ఇవ్వాలని సూచించారు. గొబ్బూరు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని పత్రికల్లో వచ్చినా అధికారులు స్పందించకపోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. గతంలో టీడీపీ సర్పంచులు ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయకుండా నిలిపేయాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎప్పుడైనా చెప్పిందా అని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రభుత్వం మారంగానే టీడీపీ నాయకులు చెప్పిన వారికి ట్యాంకర్లు, రేషన్ షాపులు, మధ్యాహ్న భోజనం కార్మికులుగా ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తేవడం ఎంత వరకు న్యాయమని చెప్పారు. మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా కొడితే ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓను ఆదేశించారు. గ్రామాల్లో చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకెళ్లి మళ్లీ ఇంటి వద్ద తీసుకురావాల్సిన బాధ్యత ఆయాలు చేయడం లేదని తోకపల్లి సర్పంచ్ జిల్లెల మల్లీశ్వరి, పెద్దారవీడులో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం భవనంలో గేదెలు, వ్యవసాయ పనిముట్లు పెట్టారని ఎంపీటీసీ గొట్టం రాజనారాయణమ్మ, మార్కాపురం నుంచి రామాయపాలెం, సానికవరం గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సును నడపాలని సర్పంచులు పొందుగుల వెంకటరెడ్డి, మూల రమణారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, వైస్ ఎంపీపీ పోటు కుమారి, గుండారెడ్డి యోగమ్మ, మండల కోఆప్షన్ మెంబరు షేక్ నూర్‌అహ్మద్, డాక్టర్లు బాలునాయక్, రవి, ఏఓ బుజ్జిబాయి, ఏఈ రమేష్, ఏపీఎం శ్రీనివాసులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘరానా మోసగాడు అరెస్టు

● రూ.18.20 లక్షల నగదు స్వాధీనం



ఘరానా మోసగాడి నుంచి నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: రసాయనాలు కలిపి డబ్బు రెట్టింపు చేస్తానని నమ్మించి మోసానికి పాల్పడిన చిన్న సుబ్బరాయుడు అలియాస్ నాయుడును రెండవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి పంపారు. నెల్లూరు జిల్లాకు చెందిన నాయుడు బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వ్యాపారంలో కర్నూలు నగరం భాస్కర్‌నగర్‌లో నివాసముంటున్న సయ్యద్ మహమ్మద్‌కు పరిచయమయ్యాడు. కెమికల్స్ కలిపితే డబ్బు రెట్టింపు అవుతుందని నమ్మించాడు. సయ్యద్ మహమ్మద్ వద్ద కొన్నాళ్ల క్రితం రూ.5 వేలు తీసుకుని కెమికల్స్ కలిపినట్లుగా నమ్మించి రూ.10 వేలు ముట్టజెప్పాడు. దీంతో సయ్యద్ మహమ్మద్ డబ్బుకు ఆశ పడి తన బ్యాంకు ఖాతా, కన్‌స్ట్రక్షన్ ఆఫీస్ ఖాతాలో ఉన్న రూ.19.50 లక్షలు డ్రా చేసి నాయుడుకు ముట్టజెప్పేందుకు సిద్ధం చేసుకున్నాడు. జులై 19న అశోక్‌నగర్‌లో ఉన్న సయ్యద్ మహమ్మద్ ఆఫీస్‌కు నాయుడుతో పాటు మరో వ్యక్తి వచ్చి రూ.19.50 లక్షల నగదు కట్టలను డబ్బాలో వేసి వాటిపై ద్రావణం చల్లి కొద్ది సేపట్లో రెట్టింపు అవుతుందని నమ్మించాడు. మహమ్మద్‌ను దృష్టి మళ్లించి డబ్బాలో ఉన్న అసలు నోట్లను తస్కరించి తెలుపు, నలుపు కాగితాల కట్టలను డబ్బాలో పెట్టి మూసివేశాడు. డబ్బు రెట్టింపు చేసే మిషన్ తీసుకుని వస్తానని చెప్పి సయ్యద్ మహమ్మద్ కారులో బయటకు వెళ్లి పెద్దాసుపత్రి వద్ద టిఫిన్ చేస్తానని డ్రైవర్‌ను నమ్మించి డబ్బుతో ఉడాయించాడు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన సయ్యద్ మహమ్మద్ రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి పక్కా ఆధారాలతో మంగళవారం సీఐ నాగరాజరావు తన సిబ్బందితో చిన్న సుబ్బరాయుడును ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం తాళ్లూరు మండలం మాధవవరం గ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. కర్నూలుకు తీసుకువచ్చి విచారించగా నేరాన్ని అంగీకరించాడు. రూ.18.20 లక్షల నగదును స్వాధీనం చేసుకుని నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ నాగరాజరావు తెలిపారు.

మరో ఇద్దరు ఎస్‌ఐలకు వీఆర్

● నలుగురికి పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వులు జారీ

ఒంగోలు టౌన్: బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో నలుగురు ఎస్‌ఐలకు పోస్టింగులు ఇస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మరో ఇద్దరు ఎస్‌ఐలను వీఆర్‌కు పంపించారు. కురిచేడు పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న బి.శ్రీకాంత్‌ను నాగులప్పలపాడు పీఎస్‌కు బదిలీ చేశారు. జిల్లా వీఆర్‌లో ఉన్న వి.మహేష్‌ను దోర్నాల పోలీసు స్టేషన్, అలాట్‌మెంట్‌లో ఉన్న బి.సుదర్శన్ యాదవ్‌ను అర్థవీడు, వెలిగండ్ల పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎం.శివను కురిచేడు బదిలీ చేశారు. నాగులప్పలపాడు ఎస్‌ఐ బి.బ్రహ్మనాయుడు, అర్థవీడు ఎస్‌ఐ ఎం. అనితలను వీఆర్‌కు పంపించారు.

క్లుప్తంగా

శిశు వసతి గృహానికి పసికందు అప్పగింత



పాపను శిశు వసతి గృహానికి అప్పగిస్తున్న బాలల పరిరక్షణ అధికారి దినేష్‌కుమార్

ఒంగోలు సిటీ: బాపట్ల జిల్లా సంతమాగులూరు మండల పరిధిలో 9 రోజుల క్రితం చెత్తకుప్పలో దొరికిన ఆడ శిశువును అధికారులు శిశు వసతి గృహానికి ఆదివారం అప్పగించినట్లు జిల్లా సమగ్ర బాలల పరిరక్షణ అధికారి పి. దినేష్ కుమార్ చెప్పారు. 9 రోజుల క్రితం రెండు రోజుల వయసున్న ఆడ శిశువును చెత్తకుప్పలో పడేశారన్న సమాచారంతో అంగన్‌వాడీ సిబ్బంది రక్షించి ఒంగోలు తరలించారు. వైద్య పరీక్షల కోసం జీజీహెచ్‌లో చేర్పించగా..

పాప ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు ధృవీకరించారు. బాలల సంక్షేమ కమిటీ సభ్యులు డి.నీలిమ, వంశీలత, శివశంకర్, సుమన శ్రీ,శిశు గృహ మేనేజరు రఫా హేరియట్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలో బంగారు పతకం



యశ్వంత్‌కు బంగారు పతకం, సర్టిఫికెట్ ఇస్తున్న వెంకటేశ్వర్లు

కొత్తపట్నం: సౌత్ ఇండియా చాంపియన్ షిప్ -2024 కరాటే పోటీల్లో జిల్లా వాసి సత్తా చాటాడు. కొత్తపట్నం మండలం, కె.పల్లెపాలెం గ్రామానికి చెందిన తమ్ము యశ్వంత్ అనే విద్యార్థి ఈ నెల 17, 18వ తేదీల్లో చెన్నైలోని మౌంట్ ఫోర్ట్ ఇండోర్ స్టేడియంలో సౌత్ ఇండియా కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడో సౌత్ ఇండియా చాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించాడు. 40 కేజీల పురుషుల విభాగంలో తమ్ము యశ్వంత్ పోటీపడి విజయం సాధించాడు. ఈ సందర్భంగా కె.పల్లెపాలెంలో గ్రామస్తులు మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కోచ్‌గా వల్లభుని వెంకటేశ్వర్లు వ్యవహరించారు. గ్రామస్తుల సహకారంతో జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటానని ఆయన తెలిపారు. సిద్ధార్థ కరాటే అకాడమీ కోచ్ నెల్లూరి మోహన్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండు మోటారు సైకిళ్లు ఢీ

● ఇద్దరికి తీవ్ర గాయాలు

సింగరాయకొండ: మోటారు సైకిళ్లు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయిన సంఘటన మంగళవారం స్థానిక చేపల మార్కెట్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక రైల్వేస్టేషన్ లో స్టేషన్ మాస్టర్‌గా పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన బి. మనోజ్, రైల్వే సిబ్బంది కలిసి మోటారుసైకిల్ పై కందుకూరు రోడ్డు సెంటర్ వైపు వస్తుండగా అదే సమయంలో రాంగ్ రూట్ లో కందుకూరు మండలం అమ్మపాలెం కు చెందిన కె. పవన్, మరో వ్యక్తి స్పోర్ట్స్ బైక్‌పై అతివేగంగా వచ్చి బలంగా ఢీ కొన్నాడు. ఈ ఘటనలో స్టేషన్ మాస్టర్ మనోజ్‌కు కాలు విరగ్గా, పవన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నలుగురిని 108 లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆరీఫ్ హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు



నిందుతుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగదీష్ నాయక్

చీరాల: చీరాల ప్రాంతంలో సంచలనం సృష్టించిన సయ్యద్ ఆరీఫ్ హత్య కేసులో మిగిలిన ఇద్దరు నిందుతులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ జగదీష్ నాయక్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈనెల 6న చీరాల మండలం ఈపూరుపాలెం ఈసుబ్‌నగర్‌కు చెందిన సయ్యద్ అమీన్ ఆరీఫ్ (18)ను అతి కిరాతకంగా హత్య చేసిన ఘటనలో సంబంధం ఉన్న వారిలో ఆరురిని ఈనెల 12 న అరెస్టు చేశామన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉండగా వారిని అరెస్టు చేసేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ ఆధ్వర్యంలో డీఎస్పీ జగదీష్‌నాయక్, చీరాల రూరల్ సీఐ, ముగ్గురు ఎస్సైలు, 20 మంది సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేసులో మిగిలిన ఇద్దరు గరిక మహేంద్ర, కర్రెద్దుల వంశీకుమార్‌లను మంగళవారం వాడరేవు–రామాపురం బీచ్ రోడ్డులో ఒకరిని, ముస్నం అపార్టుమెంట్ దగ్గర ఒకరిని అరెస్టు చేశామన్నారు. అలానే నేరానికి ఉపయోగించిన టాటా సఫారీ స్ట్రోమ్ కారును సీజ్ చేశామన్నారు. ఈ కేసులో ముద్దాయిలపై త్వరితగతిన చార్జిషీట్ దాఖలు చేసి న్యాయస్థానంలో ముద్దాయిలకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో విశేష కృషి చేసిన అడిషినల్ ఎస్పీ విఠలేశ్వర్, డీఎస్పీ జగదీష్ నాయక్, సీఐ ఎస్.సత్యనారాయణ, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

పనులపై మెలిక.. ఎందుకు ఏలికా?

సాగర్ నీరు దరి చేరబోతోందన్న ఆశ పొదిలి, మర్రిపూడి వాసుల్లో క్రమంగా సడలిపోతోంది. సాగర్ నీటి పైప్‌లైన్ పనులు ఆగవని భావించిన వారికి కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం షాకిచ్చింది. ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు గడిచినా పైప్‌లైన్ పనుల్లో అడుగు ముందుకు పడలేదు. ఉన్నపళంగా పనులు నిలిపేయడం కాంట్రాక్టర్ మార్పుకా, కమీషన్ల దండుకునేందుకా అని స్థానికంగా చర్చ నడుస్తోంది.

- పొదిలి, మర్రిపూడికి సాగర్ నీటి సరఫరాపై నీలి నీడలు
- రూ.50 కోట్ల అంచనా వ్యయంతో దర్శి సాగర్ కెనాల్ నుంచి పొదిలి వరకు పైప్‌లైన్
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వడివడిగా సాగిన పైప్‌లైన్ పనులు
- ఎన్నికల కోడ్ వచ్చే నాటికి రెండు కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పూర్తి
- పొదిలి నుంచి మర్రిపూడి పైప్‌లైన్‌కు గత ప్రభుత్వంలోనే మరో రూ.28.5 కోట్లు మంజూరు
- సర్వే ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు అధికారుల ఏర్పాట్లు
- కూటమి ప్రభుత్వంలో పనులు చేపట్టకపోవడంతో నీటి కష్టాలపై జనంలో ఆందోళన



పనుల కోసం సిద్ధం చేసిన పైపులు



సాగర్ కాలువ నీటి మళ్లింపు ప్రతిపాదిత ప్రాంతం

పొదిలి/మర్రిపూడి: పొదిలి పట్టణంతోపాటు మర్రిపూడి మండలంలోని సుమారు పది గ్రామాల ప్రజలకు సురక్షిత తాగునీరు, సాగు నీరు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అప్పటి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి విజ్ఞప్తి మేరకు దర్శి నుంచి పొదిలి వరకు సాగర్ పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం పరిపాలనా అనుమతులిచ్చింది. సుమారు 17 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు రూ.50 కోట్లు మంజూరు చేసింది. అలాగే మార్కాపురం పర్యటనకు వచ్చిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌కు మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి చేసిన విజ్ఞప్తి మేరకు పొదిలి–మర్రిపూడి పైప్‌లైన్ పనులకు మార్గం సుగమమైంది. రూ.28.5 కోట్ల అంచనా వ్యయంతో 11.4 కి.మీ పైప్‌లైన్ పనులు చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి.

పథకం ఉద్దేశమిది..

కొత్తరెడ్డిపాలెం సమీపంలోని దర్శి సాగర్ కెనాల్ నుంచి పొదిలి పెద్ద చెరువు వరకు 17 కి.మీ మేర పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటిని తరలించడం, అక్కడి నుంచి అలుగు కాలువల ద్వారా చిన్న చెరువుకు నీటిని సరఫరా చేయడం, అక్కడ ఫిల్టర్ బెడ్లలో నీటిని శుద్ధి చేసి కుళాయిల ద్వారా పొదిలి పట్టణ ప్రజలకు తాగునీరు అందించే లక్ష్యంతో ఈ పథకం ఏర్పాటుకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పొదిలి నగర పంచాయతీ పరిధిలోని 40 వేల మందికి తాగునీరు, వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించేలా ఈ పథకం డిజైన్ చేశారు. మరో వైపు పెద్ద చెరువు, చిన్న చెరువులకు నీరు చేరడం మూలంగా సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. ప్రధానంగా రాజుపాలెంలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కరించేందుకు ఈ నీటి పథకం ఉపయోగపడుతుంది. పొదిలి వాసుల చిరకాల కోరిక నెరవేర్చే నీటి పథకం శిలాఫలకాన్ని గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. పథకం కోసం అవసరమైన నీటి కేటాయింపులు కూడా నిధులతో పాటే మంజూరయ్యాయి.

పనులెందుకు ఆగాయో?

వేలాది మంది ప్రజల దప్పిక తీర్చే సాగర్ పైప్‌లైన్ పనులు సుమారు రెండు కిలోమీటర్ల మేర పూర్తయ్యాయి. మిగిలిన పనుల కోసం పైపులను కూడా సిద్ధంగా ఉంచారు. ప్రభుత్వం మారిన తర్వాత పనులు అర్ధంతరంగా ఎందుకు ఆగాయన్న ప్రశ్నకు మౌనమే సమాధానంగా వస్తోంది. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారే తప్ప ఆ దిశగా అడుగులు పడటం లేదు.



మర్రిపూడి మండలంలో అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ కోసం భూ సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

మర్రిపూడిలో సర్వేతో సరి

మర్రిపూడి మండలంలోని గుండ్లసముద్రం, మర్రిపూడి ఇరిగేషన్ చెరువులకు మహర్దశ పట్టబోతోందన్న రైతుల సంతోషం అంతలోనే ఆవిరైంది. పొదిలి చిన్న చెరువు నుంచి గుండ్లసముద్రం, మర్రిపూడి చెరువులకు అండర్ గ్రౌండ్ సాగర్ పైప్‌లైన్ వేసేందుకు సమగ్ర భూ సర్వే చేపట్టారు. మండలంలోని 36 వేల మంది ప్రజల నీటి కష్టాలు తొలగించేందుకు ప్రారంభమైన పనులు సర్వే దశలోనే ఆగిపోవడంతో తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. ఈ పథకం పూర్తయితే మర్రిపూడి మండలంలోని వల్లాయపాలెం, దుగ్గిరెడ్డిపాలెం, కెల్లంపల్లి, పన్నూరు, పిన్నికవారిపాలెం, చిమట, శివరాయునిపేట తదితర గ్రామాల ప్రజల దాహార్తి తీరడమేకాక, భూగర్భజలాలు గణనీయంగా పెరగనున్నాయి.

మంచినీటి కల నెరవేర్చాలి



పథకం పూర్తయితే తొలి లబ్ధిదారులు తీవ్ర నీటి సమస్యలతో అల్లాడే ప్రకాశ్‌నగర్ వాసులే. ఏళ్ల తరబడి సాగర్ నీటి కోసం పట్టణ వాసులు ఎదురుచూస్తున్నారు. త్వరతగతిన పనులు పూర్తి చేసి మంచినీటి సమస్య తీర్చాలి. రాజకీయాల మూలంగా నీటి పథకం ఆగకుండా ముందుకు సాగుతుందని ఆశిస్తున్నాం.

– నూర్జహాన్ బేగం

భూగర్భ జలాలు పెరుగుతాయి



సాగర్ నీటితో చెరువును నింపడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. తద్వారా డీప్ బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది. సాగునీరు అందిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. పథకం పనులు మొదలు కాగానే సంతోషించాం. కానీ పనులు అర్ధంతరంగా ఆగిపోవడం బాధాకరం. పనులను పునఃప్రారంభించి వేగంగా పూర్తయ్యేలా చూడాలి.

– పులిగొర్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్

అలుగు కాలువలైనా బాగుపడతాయి



పట్టణం మధ్యలో అలుగు కాలువలు మురికి కూపాల్లా తయారయ్యాయి. పనులు జరిగితే ఈ కాలువలు బాగుపడతాయి. పెద్ద చెరువు అలుగు కాలువ నుంచి మంచినీటిని చిన్న చెరువుకు తరలించే పనుల్లో భాగంగా ఈ కాలువలను అభివృద్ధి చేయాల్సి ఉంది. సాగర్ పైపులైన్ పనులు జరిగితే నీటి కష్టాలతో పాటు మురుగు సమస్య కూడా తీరుతుంది.

– డాక్టర్ వెంకటరెడ్డి

పనులు ప్రారంభిస్తాం

సాగర్ నీటి పైప్‌లైన్ పనులు వెంటనే ప్రారంభిస్తాం. యంత్రాలు, ఆపరేటర్లును కాంట్రాక్టర్లు సిద్ధం చేసుకుంటున్నారు. పైపులైన్ పనులు తుది దశకు చేరిన వెంటనే చెరువులు, అలుగు కాలువలను శుభ్రం చేయిస్తాం.

– సాదిక్ బాషా, ఇరిగేషన్ డీఈ

మైనర్‌పై అఘాయిత్యం



నిందితుడు టీడీపీ నాయకుని కుమారుడు

- కూల్‌డ్రింక్‌లో మత్తు మందు ఇచ్చి అత్యాచారం
- పలుమార్లు బెదిరించి లైంగిక దాడి
- ప్రస్తుతం ఆ బాలిక 7వ నెల గర్భిణి
- తల్లిదండ్రులకు తెలిసేసరికి రాజీకి యత్నం
- కావలిలో కేసు నమోదు
- చిన్న వయసులో గర్భిణి కావడంతో విషమంగా బాలిక ఆరోగ్య పరిస్థితి

దర్శి: టీడీపీ నాయకుడి కుమారుడు బీసీ కులానికి చెందిన 14 ఏళ్ల బాలికకు కూల్‌డ్రింక్‌లో మత్తు మందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడిన సంఘటన దర్శి మండలం రాజంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత బాలిక తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. కావలిలో నివాసముంటున్న దంపతుల కుమార్తె (14) దర్శి మండలానికి సమీపంలోని గ్రామంలోని అమ్మమ్మ వద్దనే ఉంటోంది. ఐదో తరగతి నుంచి ఇక్కడే చదువుకుంటోంది. అదే గ్రామంలో టీడీపీ నాయకుని కుమారుడు ఏనుగంటి చరణ్ సాయి (20) పదో తరగతి వరకు చదివి ఖాళీగా ఉన్నాడు. వారికి ఒక కారు, ఆటో ఉండగా వాటిని తోలుకుంటున్నాడు. ఏడాదిగా బాలికకు మాయమాటలు చెప్పి లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. కావలిలో ఉన్న బాలిక ఇంటికి వెళ్లి మాయమాటలు చెప్పి తీసుకుని వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ విషయం తెలిసి బాలిక తల్లిదండ్రులు రైల్వే స్టేషన్‌కు రాగా బాలికను వదిలేసి చరణ్ సాయి పారిపోయాడు. దీంతో వారు చరణ్ తల్లిదండ్రులకు విషయం తెలియజేయగా మా అబ్బాయికి భయం చెప్పుకుంటామని చెప్పారు. దీంతో సదరు బాలికను అమ్మమ్మ ఇంటికి పంపారు. స్కూల్ నుంచి ఇంటికి వచ్చే సమయంతో బాలికకు మాయమాటలు చెప్పి కారులో ఎక్కించుకుని దర్శిలో తన స్నేహితుల రూమ్‌కు తీసుకుని వెళ్లి కూల్‌డ్రింక్‌లో మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించి పలు మార్లు ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. భయంతో ఆ బాలిక ఎవరికీ చెప్పకుండా ఉండిపోయింది. ఇటీవల బాలిక బాగా నీరసంగా ఉండటంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకుని వెళ్లారు. అక్కడ బాలిక 7వ నెల గర్భిణి అని డాక్టర్లు చెప్పడంతో వారు విస్తుపోయారు. తల్లిదండ్రులు గద్దించడంతో జరిగిన విషయాన్ని ఆ బాలిక పూసగుచ్చినట్లు వివరించింది. బాలికను మోసం చేసిన టీడీపీ నాయకుని ఇంటికి వెళ్లిన తల్లిదండ్రులు తమ కూతురికి జరిగిన అన్యాయం గురించి నిలదీశారు. తమ కుమార్తెతో పెళ్లి చేయాలని యువకుడి తల్లిదండ్రులను అడిగారు. అందుకు వాళ్లు ఒప్పుకోలేదు. పోలీస్ పెద్దలతో రాజీ చేసేందుకు ప్రయత్నాలు చేశారు. దీంతో ఇక్కడ కేసులు కూడా కట్టరని తెలిసి కావలి పోలీస్ స్టేషన్‌కు బాలికను తీసుకుని వెళ్లి ఫిర్యాదు చేశారు. అక్కడ కూడా దర్శి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. దర్శి పోలీసులే మీది కావలి అని అక్కడకు పంపారని సమాధానం ఇచ్చారు. ఇరువురు పోలీసులు చర్చించుకుని ఎట్టకేలకు కావలి పోలీస్ స్టేషన్‌లో నాలుగు రోజులు క్రితం కేసుకట్టారు. అయితే మంగళవారం కావలి సీఐ కార్యాలయంలో పంచాయతీ జరగ్గా తల్లిదండ్రులు అమ్మాయిని పెళ్లి చేసుకోవాల్సిందేని పట్టుబట్టారు.. వాళ్లు మాత్రం అందుకు అంగీకరించలేదు. ఇక పోలీసులు కూడా చేసేదేం లేక కేసుకట్టాం కోర్టులో తేల్చుకోవాలని సూచించారు.

బాలిక పరిస్థితి విషమం

బాలిక పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. చిన్న వయసులో గర్భం దాల్చడంతో బాలిక కాన్పు అయ్యే పరిస్థితులు తక్కువగా ఉంటాయని చెప్పారు. ఆపరేషన్ చేయాలన్నా బాలిక చాలా బలహీనంగా ఉందని అన్నారు. దీంతో ఏం చేయాలో అర్థంకాక తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. తన కుమార్తెకు జరిగిన అన్యాయానికి ఎవరు న్యాయం చేస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

పోలీసులు ఆరోగ్యంగా ఉండాలి

● ఎస్పీ ఏఆర్ దామోదర్



పోలీస్ క్రికెట్ మ్యాచ్‌లో గెలుపొందిన విజేతలను అభినందిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: పోలీసు శాఖలో విధులు నిర్వర్తించే వారు నిత్యం ఆరోగ్యంగా.. చురుకుగా ఉండాలని, మంచి ఆహారపు అలవాట్లతో హుషారుగా వ్యవహరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ఏఆర్ పోలీసు మైదానంలో నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంటులో విజేతలను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అభినందించారు. ఆయన మాట్లాడుతూ దర్యాప్తులు, బందోబస్తులతో నిత్యం సతమతమవుతున్న పోలీసుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహించినట్లు తెలిపారు. క్రీడల్లో పోలీసు సిబ్బంది చూపిన ఉత్సాహం, పోరాట స్ఫూర్తిని అభినందించిన ఆయన విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను కూడా ఇదే స్ఫూర్తితో అధిగమించాలని సూచించారు. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను ఎంపిక చేసుకొని విధిగా రాణించాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయమం చేయాలని, ఒత్తిడిని అధిగమించేందుకు యోగ, మెడిటేషన్, పుస్తకాలను చదవడం వంటివి అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని డివిజన్లలో కూడా ఇలాగే క్రీడలను నిర్వహిస్తామని తెలిపారు.

సత్తా చాటిన పోలీస్ ఆఫీసర్స్ టీం

ఏఆర్ పోలీసు మైదానంలో నిర్వహించిన ఈ టోర్నమెంటులో ఎనిమిది టీంలు రెండు గ్రూపులుగా తలపడ్డాయి. ఏ గ్రూపులో స్వాట్ టీం జూనియర్, డీపీఓ టీం, ఐటీ కోర్ టీం, పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్ టీంలు పాల్గొన్నాయి. బి గ్రూపులో స్పెషల్ పార్టీ జూనియర్ టీం, స్పెషల్ పార్టీ సీనియర్, స్వాట్ టీం సీనియర్, ఆఫీసర్స్ టీంలు పాల్గొన్నాయి. ఈ రెండు గ్రూపుల మధ్య హోరాహోరీగా పోరు జరిగింది. పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్ టీం, పోలీస్ ఆఫీసర్స్ టీంల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. చివరకు పోలీస్ ఆఫీసర్స్ టీం విజేతగా నిలిచింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ఆర్ఎస్ఐ కె. మాల్యాద్రి అందుకున్నారు. ఈ అభినందన కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, ఆర్ఐ రమేష్ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ అందరి బాధ్యత

● జిల్లా మలేరియా అధికారి డా. మాదవీలత



ప్రపంచ దోమల దినోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డా.మాధవీలత

ఒంగోలు టౌన్: అనేక రకాల వ్యాధులకు కారణమైన దోమల నియంత్రణ, నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని జిల్లా మలేరియా అధికారి డా.మాధవీలత కోరారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకొని వీఎస్ఆర్ పాఠశాలలో మంగళవారం జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమ రహిత సమాజం, ఆరోగ్యానికి సోపానం అనే నినాదంతో ఈ ఏడాది ఆంధ్ర ప్రదేశ్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ దోమలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు దోమలపై అవగాహన చేసుకొని తల్లిదండ్రులకు తెలపాలని, ఇంటిలో దోమలు పెరగకుండా, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మలేరియా, చికున్ గున్యా, డెంగీ వంటి వ్యాధులు ప్రధానంగా దోమల వల్లనే వ్యాపిస్తాయని, దోమలను నివారించడం ద్వారా ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు చెప్పారు. ఎవరికైనా జ్వరంతో పాటుగా చలి కనిపిస్తే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం ద్వారా దోమలను నివారించడం సులువవుతుందన్నారు. దోమతెరలు వాడడం ద్వారా దోమ కాటును నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో మాస్ మీడియా ఉప అధికారి సరోజిని, సబ్ యూనిట్ అధికారులు సాగర్, శ్రీనివాసులు, వెంకారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. మాధవరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అరుణకేతుక యాగం



యాగం నిర్వహిస్తున్న వేద పండితులు

మార్కాపురం టౌన్: స్థానిక గురుదత్త సంస్థాన్ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి ప్రారంభమైన అరుణకేతుక యాగం మంగళవారంతో ముగిసింది. దత్త సంస్థానంలో గత మూడు రోజులుగా వేద పండితులు మద్దూరి యజ్ఞ నారాయణశాస్త్రి, ఆలయ అర్చకుడు బి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతోపాటు అరుణకేతుక చయన సంకల్పయాగం, ఐంద్రాగ్న యాగం, ఆమీక్ష యాగం, ఇంద్ర వైమృద యాగం తదితర పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం ఈ యాగాలు నిర్వహించామని వేద పండితులు పేర్కొన్నారు. కుబేర బలి ఆరాధన వల్ల అష్టైశ్వర్య సిద్ధి కులుగుతుందన్నారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

దేశం కోసం ప్రాణాలు అర్పించేది సైనికులే



ప్రాణాలు కోల్పోయిన సైనికుల భార్యలను సత్కరిస్తున్న మాజీ సైనికులు

గిద్దలూరు రూరల్: దేశ రక్షణ కోసం సైనికులు తమ ప్రాణాలను సైతం అర్పించేందుకు సిద్ధంగా ఉంటారని మాజీ సైనికుల సంఘ జిల్లా అధ్యక్షుడు జీసీ అంకన్న అన్నారు. 25వ సంవత్సర కార్గిల్ విజయోత్సవం సందర్భంగా పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మంటపంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన 15 మంది సైనికుల భార్యలకు ఒక్కొక్కరికి రూ.15 వేలు అందజేశారు. అదే విధంగా 45 మంది కార్గిల్ యుద్ధ వీరులకు ప్రశంసపత్రాలు పంపిణీ చేశారు. దేశం కోసం కుటుంబ సభ్యులను వదిలి అహర్నిశలూ శ్రమించే వారి సేవలను ఎప్పటికి గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తితో జీవించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గిద్దలూరు నియోజకవర్గంలోనే అత్యధికంగా సైనికులు ఉన్నారన్నారు. ఈ ప్రాంతంలో ఈసీహెచ్ఎస్‌కు శాశ్వత భవనం, మాజీ సైనికులకు, వితంతువులకు ఇంటి స్థలాలు, సంఘ కార్యాలయానికి స్థలం వంటి వాటి గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ సైనికులు ఎం.కోటారెడ్డి, హరినారాయణరెడ్డి, రామకృష్ణయ్య, ఏఆర్‌కే రెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

దున్నపోతును ఢీకొట్టిన బైక్

● దున్నపోతు అక్కడికక్కడే మృతి

వేటపాలెం: మోటార్ బైక్‌పై వేగంగా వెళ్తూ రోడ్డు దాటుతున్న దున్నపోతును ఢీకొట్టారు యువకులు. ఈఘటనలో దున్నపోతు అక్కడికక్కడే మృతి చెందిగా ముగ్గరి యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ఈప్రమాదం మంగళవారం రాత్రి 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డు వేటపాలెం వై జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. వేటపాలేనికి చెందిన పోగడ దండ వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డి మరో యువకుడు చీరాల నుంచి బైపాస్ రోడ్డులో మోటార్ బైక్ వస్తున్నారు. అదే సమయంలో వేటపాలెం బైపాస్ రోడ్డు వై జంక్షన్ దగ్గరలో రోడ్డు దాటుతున్న దున్నపోతును బైక్ ఢీకొట్టారు. ఈప్రమాదంలో దున్నపోతు అక్కడికక్కడే మృతి చెందగా బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో ముగ్గురు యువకులను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. బైపాస్ వై జంక్షన్ వద్ద వీధి లైట్లు లేకపోవడంతో తరచూ ఈప్రాంతంలో వాహనదారులు పలు ప్రమాదాల బారినపడుతున్నారు.